ప్రజాశక్తి
గురువారం 6 జులై 2023
5
విజయనగరం

పోలీసు సంక్షేమ పాఠశాలలో
పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసుశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు, ఫిజికల్‌సైన్సు బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతోపాటు దరఖాస్తుతో ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న మౌఖిక పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. ఇంగ్లీషు పోస్టుకు బిఎ లేదా ఎంఎ ఇంగ్లీషుతో పాటు బిఇడి,టెట్, సైన్సు పోస్టుకు బిఎస్‌సి లేదా ఎంఎస్‌సి, బిసిడి, టెట్ అర్హత ఉండాలన్నారు. సందేహాల నివృత్తి కోసం స్కూలు హెచ్‌ఎం 94917 99315, రిజర్వు ఇన్‌స్పెక్టర్ వెల్ఫేర్ 8333098659 నెంబరును సంప్రదించాలని తెలిపారు.



ప్రయివేటు స్కూల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

ప్రయివేటు స్కూళ్లలో
పుస్తకాల బాదుడు

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాల భారం విద్యార్థుల తల్లిదండ్రుల పాలిట పెనుభారంగా మారింది. ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేయడం లేదు సరికదా, ప్రైవేటు పబ్లిషర్స్ నుంచి తెచ్చుకున్న పుస్తకాల ధరలు నాలుగింతలు పెంచి విక్రయిస్తున్నారు. నారాయణ, చైతన్య వంటి స్కూళ్లలో అయితే మరీ దారణంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 10 తరగతి విద్యార్థుల నుంచి పుస్తకాల కోసం రూ.6వేలు నుంచి రూ.20వేలు వరకు వసూలు చేయడం గమనార్హం.

- రూ.6 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు
- అచేతనంగా అధికారులు
- పట్టించుకోని ప్రభుత్వం
- విద్యార్థుల తల్లిదండ్రులపై పెనుభారం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో రైషనలైజేషన్ పేరిట చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసిన విషయం విధితమే. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1805 వరకు ఉన్నాయి. వీటిలో 1,56,688 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు 427 వరకు ఉన్నాయి. వీటిలో సుమారు 90వేల మంది వరకు చదువుతున్నారు. వాస్తవానికి అన్ని పాఠశాలల్లోనూ ప్రభుత్వం రూపొందించిన పుస్తకాలను భోదించాల్సి వుంది. ప్రభుత్వ పాఠశాలల వరకు ఇది అమలవుతున్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేయడం లేదు. వీటిలోవున్న పాఠ్యాంశాలను కాస్త అటు ఇటుగా మార్పులుచేసి, ఆమేరకు పేజీలు పెంచి ప్రైవేటు పబ్లిషర్స్ ముద్రించిన పుస్తకాలను ఇక్కడ బోధిస్తున్నారు. వీటికి వర్కుబుక్స్, నోట్‌బుక్స్ వంటివి జత చేసి భారీ మొత్తానికి విక్రయిస్తున్నాయి. దీనికి తోడు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు తమ వద్దే కొనాలని మెలికపెట్టడంతో వాటిని కొనుగోలు చేయడానికి తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా నారాయణ, చైతన్య తదితర కార్పొరేట్ స్కూళ్లలో 1వ తరగతి నుంచి 10వ తరగతి లోపుగల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలకు రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా యూనిఫారాలు కూడా బయట కొనుక్కోవడానికి వీలు లేదు. వాస్తవానికి ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు సరిపడిన పుస్తకాలను ప్రభుత్వమే ముద్రించింది. సరిపడినంత మేరకు జిల్లాలకు విరివిరిగా కేటాయించింది. ప్రైవేటు పాఠశాలలు కేవలం పుస్తకాల విలువపై 5శాతం చెల్లించి ఆర్డర్స్ ఇవ్వడానికే పరిమితమయ్యాయి. వీటిని ప్రైవేటు యాజమాన్యాలు కొనుగోలు చేసి, విద్యార్థులకు ఇవ్వడానికి రూ.700 నుంచి రూ.1000 లోపే సరిపోతుంది. పుస్తకాల్లోనూ కక్కుర్తిపడ్డ యాజమాన్యాలు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల బోధన మాత్రమే చేయాలన్న నిబంధనను అధికారులు పట్టించుకోవడం లేదు. పుస్తకాలపై బాదుడును అధికారులు అరికట్టలేక అచేతనంగా ఉన్నారు.

విక్రయానికి సిద్ధంగా ఉంచిన యూనిఫాం

తల్లిదండ్రులే ప్రశ్నించాలి

పుస్తకాలకు అధిక మొత్తంలో చెల్లించాల్సిన అవసరం లేదు. అధిక వసూళ్లపై తల్లిదండ్రులే ప్రశ్నించాలి. వారు ప్రశ్నించకుండా తామేమీ చేయలేం. ప్రభుత్వ స్కూళ్లలో అయితే పాఠ్యపుస్తకాలన్నీ ఉచితంగానే పంపిణీ చేస్తున్నాం. అందుకే ప్రభుత్వ స్కూళ్లలో చదివించుకోవాలి.

- బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

తప్పని ముప్పు

మెరుగుపడని కాలువ వ్యవస్థ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ పరిధిలో మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్య స్తంగా ఉంది. చెత్తాచెదారంతో నిండిన పరిస్థితి. మురుగు కదలదు, వదలదు అన్న చందంగా పరిస్థితి తయారైంది. సాధారణంగా ఏటా వర్షాకాలం ముందే కాలువల్లో పూడిక తొలగించాల్సి ఉంటుంది. ఈ ఏడాది నగరంలో పూడిక తీత పనులు మమా అనిపించేసారు. ప్రధాన కాలువలు పూడికతో నిండి పోయినా ఆ దిశగా చర్యలు లేవు. దీంతో చిన్న పాటి వర్షం కురిసినా.. ఆయా ప్రాంతాలు ముంపునకు గురవుతు న్నాయి. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాలు చెరువును తలపించే విధంగా నీరు నిండిపోవడమే ఇందుకు నిదర్శనం. పదేళ్ల క్రితం సిటీ స్టాండ్‌కు వెళ్లే మార్గం వద్ద ఉన్న కాలువలో వరద ఉధృతికి ఓ మహిళ కొట్టుకుపోయింది. ఇప్పటికీ ఆ కాలువపై పలకలు వేయలేదు. దీంతో అక్కడ ముప్పు పొంచి ఉంది. నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలో కాలువలతో పాటు గంటస్తంభం, పిడబ్ల్యు మార్కెట్, సిటీ స్టాండ్, లంక వీధి వద్ద కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో వరద నీటి కాలువలు 100 మీటర్ల పరిధిలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అన్నీ పూడికతో దర్శనమిస్తున్నాయి. ట్యాంక్ బండ్ రోడ్‌లో ఎల్‌ఐసి కార్యా యం వద్ద నుంచి నాయుడు కాలనీ, వినాయక నగర్, పద్మావతినగర్ మీదుగా ధర్మపురి వరకు 3కి.మీ పెద్దకాలువలు ఉన్నాయి. వర్షం కురిస్తే, సిటీ స్టాండ్ నగర పాలిక సంస్థ కార్యలయం, గంటస్తంభం, పార్కు గేటు కూడలి ముంపునకు గురవుతున్నాయి. ధర్మపురి రింగ్ రోడ్డు ప్రాంతాలతో పాటు పలు కాలనీల్లో ఇవే పరిస్థితులు నెలకొంటున్నాయి.

కార్పొరేషన్ కార్యాలయం వద్ద కాలువ దుస్థితి

నగరంలో మురుగు కాలువ. రోజుల తరబడి శుభ్రం చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. మధ్యాహ్నం వేళల్లో గ్యాంగ్ వర్కు ద్వారా పూడికతీత చేపట్టేవారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఆయా డివిజన్ల నుంచి కార్మికులను పంపడం లేదని, స్థానికంగానే పనులు జరుగుతున్నట్టు చెబుతున్నారు. మరికొన్ని చోట్ల కాలువల్లో నాణ్యతా లోపాలు, వంకర టింకర కట్టడాలతో మురుగు ముందుకు వెళ్లకుండా రోడ్డెక్కుతున్న పరిస్థితులు. ఉన్నాయి. ఇక నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కలగానే మిగిలింది. ఇది కేవలం డిపిఆర్ తయారికే పరిమితమైంది తప్ప ఆచరణకు నోచుకోలేదు. కాలువ వ్యవస్థ మెరుగు కోసం శాశ్వత పరిష్కారం దిశగా, భూ గర్భ కాలువ వ్యవస్థ నిర్మాణం జరిగితే తప్ప పరిష్కారం లభించదు. అది ఎప్పటికీ అవుతుందో పాలకులే చెప్పాల్సి ఉంది.

ప్రభుత్వ కొలువు సాధనలో ఆగిన శ్వాస

పరుగు పోటీలో యువకుడు మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మహారాష్ట్ర పూణెలో బిఆర్ఒ రిక్రూట్మెంట్ పరుగు పోటీలో పాల్గొన్న రామభద్రపురానికి చెందిన చొక్కాపు మురళీకృష్ణ (29) మృతి చెందాడు. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ లో స్టోర్ కీపర్ టెక్నికల్ పోస్ట్ కోసం కాల్ లెటర్ రావడంతో రెండు రోజులు క్రితం అక్కడకు వెళ్లి కొన్ని ఈవెంట్లలో పాల్గొన్నాడు. బుధవారం 1600 మీటర్ల పరుగుపోటీలో పాల్గొని పరుగెడుతుండగా మార్గం మధ్యలో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే స్పందించిన అధికార యంత్రాంగం వైద్యాధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరీక్షించి చూశారు. అప్పటికే శ్వాస ఆగి మృతి చెందినట్లు ధృవీకరించారు. ప్రభుత్వ కొలువు సాధిస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు విగత జీవిగా వస్తున్నాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. మురళీకృష్ణ మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

మృతిచెందిన మురళీకృష్ణ

పలు సమస్యలపై వినతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

భవిష్యత్తు గ్యారెంటీ పేరిట చేపట్టిన బస్సుయాత్రలో ప్రజలు సమస్యలపై వినతులు ఇచ్చారని, వాటన్నింటినీ పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని టిడిపి నాయకులు అన్నారు. బుధవారం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టిడిపి నియోజకవర్గ టిడిపి నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు. పట్టణ కార్యదర్శి ప్రసాద్, విజయనగరం మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, మాజీ కౌన్సిలర్ ఉమామహేశ్వరరావు మాట్లాడారు. బస్సుయాత్రను జయప్రదం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. టిడ్కో ఇళ్ల పరిశీలన సందర్భంగా అక్రమాలు జరిగినట్లు బాధితులు తమ నాయకుల దృష్టికి తీసుకొచ్చారని, దానిపై ఎమ్మెల్యే కోలగట్ల అవినీతిని నిరూపించాలని ఛాలెంజ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. మొదటి ప్రాధాన్యతా జాబితా ప్రకారమే ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ కార్యాలయం సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందని, వెంటనే ఆ షాపును మూసివేయాలని అన్నారు. నగరంలో అశోక్ ఆధ్వర్యాన 12 రహదారులకు ఆమోదం పొంది 8 పూర్తిచేస్తే మిగతా నాలుగు పూర్తి చేయడానికి వైసిపి నాయకులకు నాలుగేళ్లు సరిపోలేదా అని ప్రశ్నించారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బంగారు బాబు, మండల కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిడిపితో రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ



తంగుడుబిల్లి గ్రానైట్ క్వారీని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

టిడిపి గెలుపుతో రాష్ట్రానికి, ప్రజలకు గ్యారంటీ ఉంటుందని చైతన్య ఆపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. బుధవారం స్థానిక రామ తీర్థం జంక్షన్ లో టిడిపి భవిష్యత్ గ్యారంటీ బస్ రథయాత్ర ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు పెరిగిపోయి ఆ పార్టీ నాయకులు అందినదల్లా దోచుకుంటున్నారని ఆరోపించారు. కాబట్టి వైసిపి దుర్మార్గ పాలన అంత మొందించ డానికి భవిష్యత్ గ్యారంటీ బస్ రథ యాత్ర చేపడుతున్నామన్నారు. అనంతరం ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా కొత్త పేట, గొర్లి పేట, సీతా రామునిపేట, రామ తీర్థం మీదుగా తంగుడుబిల్లి చేరుకొని అక్రమ గ్రానైట్ క్వారీని పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎటువంటి అనుమతి లేకుండా గ్రానైట్ క్వారీ తవ్వకాలు చేపట్టడం ప్రజా ధనాన్ని దోచుకోవడానికేనని అన్నారు. అని విమర్శించారు. ఎక్కడ ఖాళీ స్థలం, చెరువులు కన బడితే చాలు వైసిపి నాయకులు పేదలని చూడకుండా కబ్జా పర్వాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలంతా వైసిపి ప్రభుత్వం అక్రమాలను గమనించి తగిన బుద్ధి చెప్పాలని టిడిపి గెలిపించడం ద్వారా రాష్ట్రానికి ప్రజలకు భవిష్యత్ గ్యారంటీ ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బస్ యాత్ర పూస పాటి రేగ మండల లో ప్రవేశించింది. కార్యక్రమంలో మాజీమంత్రి కిమిడి కళా వెంకట్రావు, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, మాజీ మంత్రి కోండ్రు మురళీ, మాజీ ఎమ్మెల్సీలు గుమ్మడి సంధ్యా రాణి, ద్వారపు రెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలిత కుమారి, ఆర్‌పి భంజ్ దేవ్, టిడిపి విజయనగరం పార్లమెంటు స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున, నియోజక వర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, డెంకాడ మాజీ ఎంపిపి, నియోజక వర్గం సీనియర్ నాయకులు కంది చంద్ర శేఖర్ రావు, నాయకులు సువ్వాడ రవి శేఖర్, మహిళా పార్లమెంటు అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రలో అశోక్‌గజపతిరాజు

ఉనికి కోసమే బస్సుయాత్ర

టిడ్కో గృహాల్లో అవినీతిని నిరూపించండి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి నాయకులు తమ ఉనికి కోసమే బస్సుయాత్ర చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బస్సు యాత్రలో వాస్తవాలు చెబితే ప్రజల హర్షిస్తారని.. అవాస్తవాలు చెబితే నమ్మే స్థితిలో ఇక్కడ ఎవరూ లేరని తెలిపారు. బుధవారం సోనియానగర్ టిడ్కో గృహ సముదాయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. టిడ్కో గహాల్లో అక్రమాలు జరిగినట్లు టిడిపి నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సోనియా నగర్‌లో బలహీన వర్గాలకు ఇళ్లు కడుతున్నామని చెప్పారు. తాను గతంలో శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు మంజూరు చేసిన పట్టాలకు ఇళ్లు కట్టి ఇవ్వలేదని.. నాడు వారే జన్మభూమి కమిటీలను పెట్టుకుని, డబ్బులు తీసుకుని గృహాలు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఎక్కడో విజయవాడలో ఎమ్మెల్సీ ఉద్యోగం చేసుకునే బుద్దా వెంకన్నకు ఇక్కడ సంగతులు ఏం తెలుస్తాయని ప్రశ్నించారు. 'వెంకన్నా.. చిత్తశుద్ధి ఉంటే మళ్లీ విజయనగరం రా.. నువ్వు చేసిన ఆరోపణలు నిరూపించు. లేదంటే మీ అశోక్‌ను ఫలానా చోట అవినీతి జరిగిందని ప్రమాణం చేయమను..' అంటూ సవాల్ విసిరారు. సారిపల్లి, సోనియానగర్‌ల్లో ఒక్క ఇంటికైనా తాము మార్చామని ఎవరితోనైనా చెప్పించగలరా? అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలకు డబ్బులు తీసుకున్నట్లు నిరూపించండని సవాల్ చేశారు. సారిపల్లిలో ఇప్పటికే 800 ఇళ్లు లబ్ధిదారులకు అందజేశామని, మరో 400ఇళ్లు త్వరలో అందించడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛమైన రాజకీయ జీవితంలో ఉన్నామని, లంచాలు తీసుకోవాల్సిన గతి తమకు పట్టలేదని స్పష్టం చేశారు. సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్లు అల్లు చాణక్య, బండారు ఆనందరావు, పట్టా ఆదిలక్ష్మి, జోనల్ ఇన్‌ఛార్జిలు, టిడ్కో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని రాస్తారోకో

ప్రజాశక్తి-కొత్తవలస

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్తు ఛార్జీలను తక్షణమే తగ్గించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తవలస జంక్షన్‌లో విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ జోరువానలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక అన్ని రకాల ఛార్జీలు పెంచడమే పనిగా పెట్టుకున్నాయని ధ్వజమెత్తారు. ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుత తరుణంలో సామాన్యులు బతకడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించకుంటే, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా 2023ను జరుపుకుంటున్న తరుణంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో మిల్లెట్స్ అండ్ న్యూట్రిషనల్ సెక్యూరిటీ అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సేమియారీడ్ ట్రోపిక్స్ (ఇక్రిశాట్) డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ అరె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రోజూ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు తప్పనిసరిగా ఉండేలా చేయాలని.. లేకుంటే చాలా రోగాలను కొనితెచ్చుకునే పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. ఇక్రిశాట్ లో చిరు ధాన్యాలపై ఎలాంటి పరిశోధనలు జరుగు తున్నాయో, ఎటువంటి సామగ్రి తయారుచేశారో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించారు. మిల్లెట్ల ద్వారా ఆరోగ్య ప్రయోజనాలతో పాటు, వాటిని పండించడానికి తక్కువ నీరు, తక్కువ పెట్టుబడి అవసరమని పేర్కొన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ కులపతి ప్రొఫెసర్ టి.వి. కట్టిమణి మాట్లాడుతూ రసాయనాలు, పురుగుమందులు, ఎరువులు వాడకుండా మిల్లెట్లను సులభంగా పండించవచ్చని, మిల్లెట్లను రొట్టెలు, ఉప్మా, గంజిగా చేసుకొని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. సదస్సుకు ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్, డీన్ అఫ్ స్కూల్ అఫ్ సైన్సెస్ అధ్యక్షత వహించగా, అసోసియేట్ ప్రొఫెసర్ డా. అనిరుధ్ కుమార్ కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోండి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-డెంకాడ, పూసపాటిరేగ

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. డెంకాడ మండలం చింతలవలస, పూసపాటిరేగ మండలం కందివలస గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, డిఎల్‌డిఒ నిర్మలాదేవితో కలిసి సురక్ష కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కందివలస సచివాలయాన్ని సందర్శించి, ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత ఉన్నవారందరికీ సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా, అవసరమైన ప్రభుత్వ సేవలను అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారవు. దీనిలో భాగంగా 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ప్రతిఒక్కరికీ ఏదో ఒక ధ్రువపత్రం అవసరం ఉంటుందని, దానికోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, గ్రామంలోనే అందిస్తున్నామని తెలిపారు. ఎవరికైనా అర్హత ఉండీ ప్రభుత్వ పథకాలు అందకపోతే, తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కందివలసలో జరిగిన కార్యక్రమంలో పూసపాటిరేగ తాహశీల్దార్ భాస్కరరావు, ఎంపిడిఒ రామారావు, సర్పంచ్ గణేష్, చింతలవలసలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, తాశీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపిడిఓ స్వరూపరాణి, సర్పంచ్ ఎర్రయ్యమ్మ, ఎంపిటిసిలు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

డెంకాడ : చింతలవలసలో ధ్రువపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రక్తదానం చేస్తున్న గృహనిర్మాణ సంస్థ సిబ్బంది

హౌసింగ్ సిబ్బంది రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం

గృహ నిర్మాణ సంస్థ 45వ వార్షికోత్సవం సందర్భంగా, ఆ సంస్థ సిబ్బంది బుధవారం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహనిర్మాణ సంస్థ ఏర్పడి 45 ఏళ్లు కావస్తోందని, తమ సంస్థ ద్వారా లక్షలాదిమంది పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చామని తెలిపారు. సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చిన సిబ్బందిని ఆయన అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. మొత్తం 29 మంది రక్తదానంలో పాల్గొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సిబ్బందికి క్రికెట్, రంగోళి, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీలను నిర్వహించి, బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ జెఎసి ఛైర్మన్ జి.మురళీమోహన్, డిఇలు డి.శ్రీనివాసన్, రంగారావు, కెఎం శ్రీనివాస్, ఎన్‌జె రత్నాకర్, పి.అప్పయ్య, ఎఇలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందితోపాటు, జిల్లా సర్వజన ఆసుపత్రి రక్తనిధి కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలస కార్మికుల సహాయానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం

తమిళనాడులోని కోయంబత్తూర్‌లో మంగళవారం ప్రహరీగోడ కూలిన ఘటనలో మృతుల కుటుంబాలకు అవసరమైన సాయమందించేందుకు అక్కడి జిల్లా కలెక్టర్ తో మాట్లాడినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం పూర్తయిన అనంతరం బాడంగి మండలంలోని వారి స్వస్థలాలకు తీసుకు వచ్చేందుకు సంబంధిత భవన నిర్మాణ కాంట్రాక్టర్ రవాణా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.

నేడు స్వగ్రామానికి మృతదేహాలు

బాడంగి : మండలంలోని వీరసాగరం గ్రామానికి చెందిన రాపాక కన్నయ్య, నక్కేలా సత్యం, కొల్లి జగన్నాథం.. కోయంబత్తూరులో నిర్మాణంలో ఉన్న పాఠశాల గోడ కూలి మృతిచెందిన విషయం తెలిసిందే. ముగ్గురి మృతదేహాలను గురువారం స్వగ్రామం వీరసాగరం తీసుకురానున్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చొప్పున పరిహారం అందించేందుకు పాఠశాల యాజమాన్యం అంగీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆ కుటుంబాలను ఆదుకోవాలి

బొబ్బిలి : కోయంబత్తూర్లో ప్రమాదవశాత్తు మరణించిన ముగ్గురు కూలీల కుటుంబాలను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. జిల్లాలో ఉపాధి పనులు లేక చాలామంది గ్రామీణ ప్రజలు బయటి రాష్ట్రాలకు పనుల కోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చాలా ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా వెనుకబాటు తనాన్ని మనపాలకులు గుర్తించి. ఇప్పటికైనా మూతపడిన పరిశ్రమలును తెరిపించి రైతు పంట ఆధారత పరిశ్రమలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు చొప్పున ఇచ్చేలా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కృషి చేయాలని కోరారు.

యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోచేపట్టిన వివిధ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములునాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో అంశాల వారీగా చర్చించారు. ముఖ్యంగా రీ సర్వే, జగనన్న సురక్ష పథకం అమలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనుల నిర్వహణ వంటి విషయాలపై చర్చించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తిస్తున్న అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత అందరి పైన ఉంటున్నారు. కాంట్రాక్టర్లు వారీగా ఏఈలు బాధ్యత తీసుకొని పనులు త్వరితగతిన పూర్తి అయ్యేవిధంగా చూడాలన్నారు. చెల్లింపులు వెనువెంటనే జరిగే విధంగా చూడాలన్నారు. జగనన్న సురక్షలో వీలైనన్ని ఎక్కువ ధ్రువీకరణ పత్రాలు అందించే విధంగా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు పునఃప్రారంభం

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మండలంలోని వికలాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు పునఃప్రారంభం అయ్యాయని ఫిజియోథెరపిస్టు డి.హిమబిందు తెలిపారు. బుధవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఫిజియోథెరపీ నిర్వహించారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతి బుధవారం 18 ఏళ్లలోపు శారీరక వైకల్యం, సెరిబ్రల్ పాల్సీ సమస్యలు ఉన్న వికలాంగులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా పిల్లలలో ఆరోగ్య పరంగా మంచి మార్పులు వస్తాయని తెలిపారు. ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహితవిద్య ఉపాధ్యాయులు ఎస్.బంగారునాయుడు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు సహకరించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

18 ఏళ్ళు నిండిన ప్రతి వ్యక్తినీ ఓటరుగా నమోదు చేయాలని, దానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ దొర కోరారు. బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షతన అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన వారిని ఓటర్‌గా నమోదు చేయించాలని సూచించారు. ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులపై నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి నారాయణమ్మ పాల్గొన్నారు.

మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

పొలాల్లో మట్టి నమూనా పరీక్షల ద్వారా రైతులు ఏ రసాయనాలు వాడాలో తెలుస్తుందని వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ తెలిపారు. బుధవారం మండలంలోని కలవరాయి గ్రామంలో మట్టి నమూనాలు సేకరించారు. ప్రతి రైతు భరోసా కేంద్ర పరిధిలో 25 చొప్పున మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కలవరాయి గ్రామంలో రైతులు ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పంట వేశారని తెలిపారు. కత్తెర పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

పార్వతమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న టిడిపి నేత గొంప కృష్ణ

పార్వతమ్మకు గొంప కృష్ణ పరామర్శ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన కలవలపల్లి పార్వతమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పరామర్శించారు. బుధవారం జాకేరులో పార్వతమ్మ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మనోధైర్యాన్ని కల్పించారు. టిడిపి ఆవిర్భావం తరువాత ఎంపిపిగా, జెడ్‌పిటిసిగా పార్వతమ్మ మండలానికి అందించిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, బానాది ఎంపిటిసి గొంప తులసి, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, సేనాపతి గణేష్, సిరికి రమణ, మంచిన అప్పలసూరి, సిరికి సూర్యనారాయణ, ఎర్రాప్రగడ సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్‌పి డివిజికి సత్కారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఉత్తమ సేవలు అందించిన మాజీ ఎమ్‌పి డాక్టర్ డివిజి శంకరరావును ఇటీవల తిరుపతిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సత్కరించింది. డాక్టర్ శంకరరావును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ విఎస్ ప్రసాద్, డాక్టర్ జెసి నాయుడు అభినందించారు.

ధర్మవరం హెచ్‌ఎంగా ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-శృంగవపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బంగారు ఉమామహేశ్వరరావు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన ఎస్.వెంకటరావు.. గంట్యాడ ఎంఇఒగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పిఎంసి ఛైర్మన్ తగరంపూడి రమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ కళాశాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ కిలపర్తి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీలుపర్తిలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి సచివాలయంలో ఎంఇఒ పి.బాలభాస్కర్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంతో కలిగే ప్రయోజనాలను ప్రతిఒక్కరికీ వివరించాలన్నారు. సమావేశంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

దళితులపై చిన్నచూపు మానుకోవాలి

ప్రజాశక్తి-వేపాడ

దళితులను చిన్నచూపు చూడటం మానుకోవాలని దళిత మహాసభ మండల అధ్యక్షులు కె.రాము ఒక ప్రకటనలో సూచించారు. మధ్యప్రదేశ్‌లో దళిత యువకుడిపై శుక్ల అనే బ్రాహ్మణుడు బహిరంగంగా మూత్రవిసర్జన చేయడం దారుణమని ఖండించారు. ఇటువంటి మూర్ఖుడికి కఠిన శిక్ష విధించడమే కాకుండా ఆలయ ప్రవేశాన్ని నిషేధించాలని కోరారు.

నేడు గర్భాంలో ప్రజాగర్జన

ప్రజాశక్తి-మెరకముడిదాం

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం గర్భాంలో ప్రజాగర్జన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజగర్జన కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కె.ధనంజయ్, ఉపాధ్యక్షులు పి.సన్యాసినాయుడు, చల్లా శ్రీరామ్, మాజీ సర్పంచ్ తాడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

రామభద్రపురం : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించినప్పుడే సమగ్ర మూర్తిమత్వం సాధిస్తారని కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్, నాయుడువలస పాఠశాల ఉపాధ్యాయులు జెసి రాజు సూచించారు. బుధవారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ప్రభుత్వం సమకూర్చిన జగనన్న విద్యాకానుకల సక్రమ వినియోగంలో ముందున్న 20 మందికి ఆయన రైటింగ్ పాడ్స్ అందించారు. ఏకరూప దుస్తులను ప్రభుత్వం సమకూర్చిన రెండురోజులకే 20 మంది విద్యార్థులు వాటిని కుట్టించుకొని ఆ దుస్తులను ధరించి పూర్తి స్థాయిలో పాఠశాలకు హాజరయ్యారు. వారిని మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

సోషల్ మీడియా ప్రభావాన్ని క్రీడలపై పడనీయొద్దు

క్రీడలపై ఆసక్తి పెంచాలి • డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సోషల్ మీడియా దుష్ప్రభావాలను క్రీడలపై, ముఖ్యంగా పిల్లలపై పడకుండా జాగ్రత్త వహించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి హెచ్చరించారు. పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెంచి తగిన ప్రోత్సాహం అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్న స్విమ్మింగ్ క్రీడ అని.. దాని ఆవశ్యకతను అందరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ నెల 11న జాతీయ స్విమ్మింగ్ పూల్ డే సందర్భంగా బుధవారం స్థానిక ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులో విలేకరుల సమావేశం నిర్వహించారు. జల క్రీడలకు ఉన్న ప్రాధాన్యత వివరించారు. పిల్లల్ని ప్రధానంగా స్విమ్మింగ్‌పై ఆసక్తి ఉన్నవారిని తగిన విధంగా ప్రోత్సహించాలని, తల్లిదండ్రులు వారికి అన్ని విధాలా సహకారం అందించాలని హితవు పలికారు. ప్రభుత్వం తరపున, తన వ్యక్తిగతంగా కూడా క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే పలు స్విమ్మింగ్ పూల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా స్పోర్ట్స్ కాంప్లెక్సును, స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పిల్లల కోసం కంటోన్మెంట్ ప్రాంతంలో ఆధునిక వసతులతో కూడిన పూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకొని క్రీడల వైపు మళ్లించి పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలని సూచించారు. ఈ నెల 11న స్థానిక కంటోన్మెంట్ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులోని స్విమ్మింగ్ పూల్‌లో జల క్రీడల ప్రాధాన్యతను తెలుపుతూ వివిధ యోగా జలాసనాలు వేయనున్నామని.. ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని డిప్యూటీ స్పీకర్ విజ్ఞప్తి చేశారు.

నమూనా జలాసనాలు వేసిన స్వామి

ఈనెల 11న జాతీయ స్విమ్మింగ్ పూల్ డే నేపథ్యంలో స్థానిక కంటోన్మెంట్ ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్సులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అర గంట సేపు వివిధ నమూనా యోగా జలాసనాలు వేశారు. కాసేపు ఈత కొట్టిన ఆయన నీటిపై తేలియాడుతూ మూడు రకాల ఆసనాలు వేశారు. అక్కడకు విచ్చేసిన ఆయన అభిమానులు, స్థానిక ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం

నగర శివారు జమ్ము ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎపిక్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నగరంలో ఇటువంటి క్రీడా కోర్టులు అవసరమన్నారు. కేవలం వ్యాపార దృష్టితో కాకుండా, క్రీడల మీద ఆసక్తితో దీన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. పది మందికీ ఉపయోగపడేలా ఇటువంటి కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. నిర్వాహకులు ముసలినాయుడును అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌ఛార్జిలు బొద్దాన అప్పారావు, బాలబ్రహ్మారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జలాసనం వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

అక్రమ లేఅవుట్‌పై డిపిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ముషిడిపల్లి పంచాయతీ పరిధిలో అక్రమంగా లేఅవుట్ వేశారని జిల్లా పంచాయతీ అధికారి, మండల అధికారులకు ఫిర్యాదు చేశామని సర్పంచ్ సోలుబొంగు దారప్పు, పంచాయతీ కార్యదర్శి అనీల్. వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు తెలిపారు. బుధవారం జరిగిన గ్రామసభలో పలువురు ఈ లేఅవుట్‌పై పంచాయతీ అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. లేఅవుట్లో ప్రభుత్వ చెరువులు ఉన్నాయని, డి-పట్టా భూముల్లో నిబంధనలకు వ్యతిరేకంగా రోడ్లు వేశారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యదర్శి అనీల్ స్పందిస్తూ లేఅవుట్‌పై అధికారులకు ఫిర్యాదుచేశామన్నారు. లేఅవుట్ యజమానులు హైకోర్టును ఆశ్రయించడంతో ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని మండల అధికారులు తమకు నోటీసులు ఇచ్చారని వివరించారు. తదుపరి ఆదేశాల తరువాత జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలన్నారు. లేఅవుట్లో ఉన్న చెరువుల్లో చేపల పెంపకానికి పంచాయతీ తరపున ప్రణాళిక తయారు చేస్తున్నామని, తద్వారా పంచాయతీ ఆదాయం సమకూర్చుకుంటామని తెలిపారు. రోడ్లు వేయాలని, పింఛన్లు ఇప్పించాలని, దొర్లపాలెంలో మినీ అంగన్వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరారు.



అమ్మఒడి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు

విద్యకే ప్రభుత్వ ప్రాధాన్యత

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

విద్యకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. బుధవారం కోమటిపల్లి గ్రామంలో గురుకుల పాఠశాలలో జగనన్న అమ్మఒడి నాలుగో విడత నిధులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో శతశాతం పూర్తి చేశారన్నారు. అనంతరం బొబ్బిలి మండల స్థాయిలో వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గాను నాలుగో విడత జగనన్న అమ్మఒడి నిధులు రూ.15.37 కోట్ల నమూనా చెక్కును విద్యార్థులు తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, వైస్ ఎంపిపి అరసాడ శంకర్రావు, డిసిఎంఎస్ డైరెక్టర్ గొట్టాపు సూర్యనారాయణ, జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మి అప్పలనాయుడు, వంగపండు శ్రీరాములు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఎస్.కోట హైస్కూల్లో అమ్మఒడి చెక్కును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 6,016 మంది విద్యార్థులకు రూ.9.02 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ మూకల కస్తూరి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, పోతనపల్లి వెంకట్రావు, ఎంపిటిసి కడారి అప్పయ్య, ఎంపిడిఒ శేషుబాబు, తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు

తాటిపూడి నీరు విడుదల

ప్రజాశక్తి-గంట్యాడ

ఖరీఫ్ సాగుకోసం తాటిపూడి రిజర్వాయరు నుంచి బుధవారం సాగునీటిని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య విడుదల చేశారు. 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలవరం నుంచి తాటిపూడికి నీటిని తీసుకురావడానికి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల సాగునీటికి కొరత ఉండదని, పుష్కలంగా పంటలు పండుతాయని చెప్పారు. పోలవరం నీటిని తీసుకురావడం వల్ల కొంతమంది రైతుల పొలాలు కోల్పోయే అవకాశం ఉందని, దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులకు పూర్తిస్థాయిలో రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందిస్తామన్నారు. తాటిపూడి రిజర్వాయరుకు జిబి అప్పారావు పేరు పెట్టాలని రైతులు ఎమ్మెల్యేను కోరగా, సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, ఇరిగేషన్ డిఇ పాండు, ఎఇ తమ్మినాయుడు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై

12న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-గంట్యాడ

మధ్యాహ్న కార్మికుల సమస్యలపై ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బి.సుధారాణి తెలిపారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం ఎంఇఒ బి.విజయ్‌కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ కష్టంగా మారిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రకటించిన గౌరవ వేతనం అందించాలని, బకాయి వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఈశ్వరమ్మ, రామలక్ష్మి, దేవి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు .

ఎండిఎం కార్మికుల సమస్యలపై వినతి

పూసపాటిరేగ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ఎంఇఒకు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ప్రతిరోజూ పెరుగుతూనే ఉన్నాయని, గ్యాస్ ధర కూడా పెరుగుతోందని తెలిపారు. దీనివల్ల పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడం కష్టంగా ఉందన్నారు. బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో పథకం నిర్వహణ భారమవుతోందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన గౌరవ వేతనాలను నేటికీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, ఇప్పటికే బకాయి ఉన్న బిల్లులు, జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లులు, వేతనాలు ప్రతినెలా ఐదో తేదీలోగా చెల్లించాలన్నారు. ఉద్యోగభద్రత కల్పించి, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు కె.సరస్వతి, గుంపు పైడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ.. వినతి అందిస్తున్న ఎండిఎం కార్మికులు, నాయకులు

ఆర్‌బిఐ ఆధ్వర్యాన విశాఖలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఆధ్వర్యాన ఈ నెల 14వ తేదీన విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించనున్నారు.దీనికి హోటల్ నొవెటెల్ వేదిక కానుంది. గ్రీన్‌పార్కు హోటల్‌లో వసతి సదుపాయం కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు ఆర్‌బిఐ తరపున మండల, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించిన లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.శ్రీనివాసరావు ప్రజాశక్తికి స్పష్టం చేశారు. ఆర్థిక అంశాలు - బ్యాంకింగ్ అనే అంశంపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు జూన్ 21, 28 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించారు. ఒక్కో స్కూల్ తరపున ఇద్దరు విద్యార్థులు టీంగా పాల్గొన్నారు. మండలం, జిల్లా స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు కూడా ప్రకటించారు. మండల స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు, జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు చొప్పున టీంలోని ఇద్దరు సభ్యులకూ కలిపి వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నారు. విజయనగరం జిల్లాల్లో ప్రథమ, భోగాపురం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ, వంగర మండలం మరువాడ జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు, మెరకముడిదా మండలం గర్భాం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. వీరందరికీ ఇప్పటికే ప్రసంశాపత్రాలు అందజేశారు. ఇలా అన్ని జిల్లాల్లోనూ మొదటి స్థానంలో నిలిచిన జట్లు 14న విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కానున్నాయి. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.17వేలు, తృతీయ బహుమతి రూ.10వేల చొప్పున ఇవ్వనున్నట్టు సమాచారం. ఈ పోటీల్లో పాల్గొనబోయే విద్యార్థులకు, వారిని తీసుకెళ్లబోయే ఉపాధ్యాయులకు ప్రయాణ ఛార్జీల నిమిత్తం ఒకొక్కరికీ రూ.500 చొప్పున ఆర్‌బిఐ ఇవ్వనుంది.

రాష్ట్ర స్థాయి పోటీల అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్లుకు చెన్నైలో జోనల్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ఇలా అన్ని జోనల్ స్థాయి పోటీలూ పూర్తయ్యేక ఢిల్లీ లేదా ముంబాయ్‌లో ఆలిండియా స్థాయి క్విజ్ పోటీల్లో నిర్వహించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆయా స్థాయిలను బట్టి ప్రముఖుల చేతులమీదుగా అవార్డులు ప్రదానం చేసే అవకాశం ఉంది. విద్యార్థుల్లో ఆర్థిక అంశాలపై అవగాహన పెంపొందించడంతోపాటు పోటీ తత్వాన్ని పెంచేందుకు ఇటువంటి క్విజ్‌పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు, అధికారులు చెబుతున్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతివ్వాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

వివక్షతకు గురవుతూ, అరకొర వేతనాలతో చేస్తున్న పంచాయతీ కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్తున్నారని, వీరికి ప్రజా మద్దతు ఉండాలని సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను కోరారు. బుధవారం మండల కేంద్రం రామభద్రపురంలో సిఐటియు ఆధ్వర్యాన పంచాయతీ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం పనికి తగ్గ వేతనం ఇవ్వాలని అధికారులకు వినతి అందించామని, లేకుంటే సమ్మెకు వెళ్ళడం తథ్యమని చెప్పామని గుర్తుచేశారు. అయినా, అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కార్మికులంతా ఒకేరకమైన పనులు చేస్తున్నప్పటికీ కొందరికి రూ.8200, ఇంకొందరికి రూ.5700 జీతం ఇస్తూ వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని ప్రభుత్వం జిఒ విడుదల చేసినా, అమలు చేయడం లేదన్నారు.

పంచాయతీ అధికారికి, సర్పంచ్‌కి ఎన్నిసార్లు విన్నవించుకున్నా పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అందరికీ జిఒ ప్రకారం పదివేల రూపాయలు ఇవ్వాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్ అమలు చేయాలని, జీతాలు బ్యాంకు ఖాతాలో వేయాలని కోరారు. కార్యక్రమంలో పరమేశ్, భవాని, లక్ష్మి, శ్యామల, తౌడు, తదితరులు పాల్గొన్నారు.

భాను కార్టూన్‌కు పురస్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రముఖ కార్టూనిస్టు టీవీ రాంప్రసాద్ తన తల్లిదండ్రులు టి.వెంకటరత్నం, వనజాత్రమ్మ స్మారక పురస్కార పోటీలు ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. అందులో 500 కార్టూన్లు రాగా, అందులో 12 మంది కార్టూన్లను ఎంపికచేశారు. అందులో బొబ్బిలికి చెందిన కార్టూనిస్టు భాను ఒకరు. ఈ పురస్కారం కింద రూ.1016 నగదు, ప్రశంసాపత్రం అందించనున్నారు. భానును బొబ్బిలి, పార్వతీపురం సాహితీమిత్రులు అభినందించారు.

CHANGE OF NAME

I, RACHAKONDA VENKATA SITA RAMA LAXMI, W/o. Namduri Jyothir Murthy, Resident of Plot No.5, Balaji Nivas, KVR Estates, Sarika PO, Vizianagaram-535004. When i have applied to Passport my name was mistakenly written as **VENKATA SITA RAMA LAXMI NAMDURI.** Both the surname/ name belongs to me only and the same person.

ధరలను అదుపు చేయలేని ప్రభుత్వం

టిడిపి నాయకులు కరణం శివరామకృష్ణ

ప్రజాశక్తి-బొండపల్లి

పెరుగుతున్న ధరలను అదుపు చేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని తమటాడ గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రంగమూ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను చూసి సామాన్యులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిలో రాష్ట్రాన్ని కాపాడే ఏకైక నాయకుడు చంద్రబాబేనని స్పష్టం చేశారు. ప్రజలు మంచి ఆలోచన చేసి రానున్న ఎన్నికలలో టిడిపిని గెలిపించాలని కోరారు. టిడిపి మినీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన అన్ని పథకాలు తూ.చ తప్పకుండా అమలు చేసి ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల శ్రీనివాసరావు, తాళ్ళపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సేవలపై ఎంపిపి సమీక్ష

ప్రజాశక్తి-గజపతినగరం

గ్రామాల్లో అందుతున్న సేవలపై ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక సమీక్షించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విద్యుత్తు సిబ్బంది, హెల్త్ సెక్రటరీలు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వర్షాకాలం దృష్ట్యా లైన్‌మేన్లు విద్యుత్తు సరఫరాకు ఆటంకం లేకుండా లైన్ క్లియిరెన్స్ చేసుకోవాలని చెప్పారు. అవసరమైన చోట కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల హెల్త్ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తూ తగిన మందులు ఇవ్వాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్లు సక్రమంగా పనులు కల్పిస్తూ మండలానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ కె.కిశోర్‌కుమార్, ఎపిఒ సిహెచ్.రామారావు, సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి జ్ఞానదీపిక

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A 237/2023 in OS 32/2023

Between:
G.V.S.N. మూర్తి మరియు 2 ఇతరులు
.....పిటిషనర్/వాదులు
And:
M. వెంకటరావు మరియు 2 ఇతరులు
....Respondents/Defendants
To
D1) మిడతాన వెంకటరావు S/o రామానాయుడు అలమండ గ్రామం, జామి మండలం, విజయనగరం జిల్లా.

NOTICE

పై దావాలో వాది ప్రతివాదిపై శ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ అందకపోవుటచే శ్రీ కోర్టువారి, ఆర్డరు ప్రకారం ఇందుమూలముగా మీకు నోటీస్ పంపించడం జరిగింది. సదరు దావా **తేది 17-07-2023**న వాయిదా యున్నది. కావున సదరు తేదినాడు మీరుగాని, మీ తరుపున వకీలు గాని **ఉదయం 10-30ని॥**లకు కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్పు చెప్పెదరు.

Manga Viswanadha Rao
G.Prakasarao,
Advocates,
Srungavarapukota, Vizianagaram,
Cell: 9490235016, 9441307191

IN THE HONOURABLE COURT OF THE MACT CUM 4th ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM. (SC& ST COURT) MVOP. 398/2014.

Between-
మజ్జి మనోహరరావు --పిటిషనర్.
And:
యం.వెంకట సత్యనారాయణ వర్మరాజు మరియు ఇతరులు - రెస్పాండెంట్లు.

R-4: **శ్రీమతి బి.విజయ లక్ష్మి,** W/o B.V. రమణ రాజు, **AP 35 U 9809** బస్సు ఓనర్, తోటపాలెం, విజయనగరం జిల్లా.

పై నెంబరు గల కేసులో పిటిషనర్ తనకు తగిలిన గాయాలకు నష్ట పరిహారము నిమిత్తము మీపై కేసు వేసినారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తము **తేది. 17-07-2023 వాయిదా అయి ఉన్నది.** కావున ఆ దినము అనగా **తేది.17.07.2023 ఉ॥గం.10.30 ని॥**లకు మీరు స్వయముగా గాని లేక మీ న్యాయవాది ద్వారా కాని కోర్టులో హాజరు కావలెను. లేని యెడల కేసును మీ పరోక్షమున విచారించి తీర్మానించడం జరుగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియజేస్తున్నాము.

కంచరాన వెంకటరమణ
న్యాయవాది,
శ్రీకాకుళం.
శ్రీకాకుళం
తేది: 05-07-2023